సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 2 । ఆగస్టు । 2023



‘ఉక్కు’లో టర్న్ అరౌండ్ ప్రతిజ్ఞ

స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకురావడమే ధ్యేయంగా అన్ని విభాగాల్లో ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. 8లో



ఏపీఎల్-2 హీరో రికీబుయ్

ఏపీఎల్ రెండో సీజన్‌లో విశాఖ కుర్రాడు రికీబుయ్‌ని రూ.8.10 లక్షలకు బెజవాడ టైగర్స్ ఫ్రాంఛైజీ నిలబెట్టుకుంది. 8లో



ప్రశాంతంగా ఫార్మేటివ్ పరీక్షలు

ఫార్మేటివ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, గణితం పరీక్ష నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి టెలిమానస్ సేవలు



టెలిమానస్ కేంద్రంలో వైద్యుల బృందం

ఏయూక్యాంపస్ : ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో బుధవారం నుంచి టెలి మానస్ సేవలు ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ రామిరెడ్డి తెలిపారు. మానసిక సమస్యతో ఇబ్బంది పడేవాళ్లు 0891- 3100189, 0891-3100048 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారు నేరుగా పైన పేర్కొన్న ఫోన్ నంబర్లలో సమస్యను వైద్యులకు తెలియజేయాలన్నారు. ఫోన్‌లో వైద్యుల కౌన్సెలింగ్, సూచనలు అందిస్తారన్నారు. ఫోన్ చేసేవారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెలి మెంటల్ వెల్త్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. నిపుణులైన మానసిక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటూ తగిన సూచనలు, చికిత్స విధానాలను సూచిస్తారన్నారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట : తల్లిపాల వారోత్సవాలను ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు చెప్పారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు అందించాలని, తల్లిపాలు తాగడం వలన శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డా.ఎస్.జీవనరాణి, పలువురు వైద్యులు ఎస్.రమా రెడ్డి, సమత, హీనా దీక్షిత్, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, అధికారులు మనోరమ, సయ్యద్ బేగం, శశిభూషణ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలా గురువులు ప్రమాణ స్వీకారం నేడు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా కోలా గురువులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జోనల్, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ శ్రేణులు హాజరుకానున్నారు.

ఫైనాన్స్ డైరెక్టర్‌గా పాండేకు అదనపు బాధ్యతలు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే ఫైనాన్స్ డైరెక్టర్‌గా మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు డైరెక్టర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వహించిన వి.వి.వేణుగోపాలరావు ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి జూలై 31 వరకు సీఎండీ అతుల్ భట్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఉత్తర్వుల మేరకు పాండే ఈ బాధ్యతలు స్వీకరించారు.

వాతావరణ అధికారి హైమారావు పదవీ విరమణ



హైమారావు దంపతులను సత్కరిస్తున్న తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద, తదితరులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రంలో వాతావరణ అధికారిగా పనిచేస్తున్న కె.హైమారావు పదవీ విరమణ చేశారు. ఈయన వాతావరణ శాఖలో 35 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించారు. పూణే, గన్నవరం, హైదరాబాద్, మచిలీపట్నం, విశాఖపట్నంలలో పని చేశారు. పదవీ విరమణ చేసిన హైమారావును తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ సునంద, అధికారులు, సిబ్బంది సత్కరించారు.

నవశకానికి నాంది



వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు విడదల రజని, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, సురేష్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, రహేజా ప్రతినిధులు

- దక్షిణాదిలో అతి పెద్ద ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ
- ఏయూలో కీలక భవనాల్ని ప్రారంభించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకూ బాటలు
- విశాఖ ప్రగతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి నీరాజనం
- అడుగడుగునా అఖండ స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారు. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. తొలుత కైలాసపురంలో రూ.600 కోట్లతో రహేజా గ్రూపు నిర్మించనున్న ప్రఖ్యాత ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందులో ఐటీ క్యాంపస్, స్టార్ హోటల్ వంటివి కూడా నిర్మిస్తారు. ఈ మాల్ అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనిమిది వేల మందికి ఉపాధి లభించనుంది. సుమారు రూ.134.58 కోట్లతో జీవీఎంసీ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు అదే ప్రాంగణం నుంచి సీఎం శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి రూ.129 కోట్లతో చేపట్టిన ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్, బయో మానిటరింగ్ హబ్ (ఎలిమెంట్), అల్గారిథమ్, ఆ-హబ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఏయూ అవంతి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. వీటి ద్వారా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఏడు వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇలా కార్యనిర్వాహక రాజధాని కానున్న విశాఖ నగరం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల చేపట్టిన ప్రాజెక్టులన్నీ అందుబాటులోకి వస్తే విశాఖ రూపురేఖలు ఎంతగానో మారిపోనున్నాయి. మౌలిక సదుపాయాలు మరింతగా విస్తరించనున్నాయి. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల తీరుతెన్నులను వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి సీఎంకు వివరించారు. ఏయూలోనూ విద్యార్థులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో స్వాగతం పలికారు. అందుకు ప్రతిస్పందనగా ముఖ్యమంత్రి తన కారు ఫుట్ రెస్ట్‌పై నిల్చొని విద్యార్థులకు అభివాదం చేశారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న రహేజా గ్రూప్ ప్రతినిధులు



అవంతి ఆక్వా కల్చర్ హబ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఏయూలో ప్రాజెక్టులను రిమోట్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం జగన్



ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలిస్తున్న సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు తరలివచ్చిన అభిమానులు



జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అభిమాన పూలవర్షం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌పై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

విశాఖ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. ఎయిర్‌పోర్టు నుంచి కైలాసపురం పోర్టు ఆస్పత్రి జంక్షన్ వరకు ఆయన ప్రయాణించిన వాహనంపై పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. విమానాశ్రయం నుంచి జాతీయ రహదారి వెంబడి కిలోమీటర్ల మేర మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మానవహారంగా ఏర్పడి జై జగన్ ప్లకార్డులతో ఘనంగా స్వాగతించారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారు, తన కోసం ఎదురుచూస్తున్న వారిని దృష్టిలో ఉంచుకొని సీఎం తన వాహనాన్ని ఆపిస్తూ వారికి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. ఉదయం 11.13 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నగరంలో అన్ని కార్యక్రమాలను ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 2.28 గంటలకు తాడేపల్లికి విమానంలో పయనమయ్యారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజని, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విమానంలో విశాఖ వచ్చారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాస్, తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజు, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులున్నారు.

53.56 శాతం పింఛన్ల పంపిణీ



కేజీహెచ్‌లో పెదవాల్తేరుకు చెందిన లక్ష్మణరావుకు, చంద్రపాలెంలో సూరిబాబుకు, అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో భీమిలి జోన్‌కు చెందిన సూర్యనారాయణకు పింఛన్లు అందిస్తున్న వలంటీర్లు

మహారాణిపేట: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక మంగళవారం రాత్రి 7 గంటల సమయానికి 53.56 శాతం పంపిణీ పూర్తయింది. గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ విభాగం, నగర పరిధిలో జీవీఎంసీ ఆధ్వర్యంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 1,57,567 మందికి వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్లు ఉన్నాయి. వీరి కోసం ప్రభుత్వం రూ.44.30 కోట్లు విడుదల చేసింది. తుది సమాచారం ప్రకారం జిల్లాలో 82,769 మందికి పింఛన్ల పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభారాణి తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు.

డీజిల్ వ్యాపారి అరెస్ట్

- ట్యాంకర్‌లో లైట్ డీజిల్ తరలిస్తుండగా పట్టుకున్న విజిలెన్స్ అధికారులు
- రూ.17.67 లక్షల విలువైన 14,940 లీటర్ల ట్యాంకర్ సీజ్

దొండపర్తి: అక్రమంగా లైట్ డీజిల్ వ్యాపారం చేస్తున్న వ్యక్తిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయిల్ సంస్థల నుంచి రవాణా చేసే ట్యాంకర్ల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి ట్యాంకర్‌లో తరలిస్తుండగా ఆటోనగర్ వద్ద పట్టుకున్నారు. రూ.17.67 లక్షలు విలువ చేసే 14,940 లీటర్ల లైట్ డీజిల్‌తో ట్యాంకర్‌ను సీజ్ చేశారు. వ్యాపారి శ్రీనివాస్‌పై 6ఏ కేసు నమోదు చేసి గాజువాక పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గాజువాక శ్రీనగర్ ప్రాంతానికి చెందిన ఎ.శ్రీనివాస్ ఎటువంటి లైసెన్సులు, అనుమతులు లేకుండా లైట్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) వ్యాపారం చేస్తున్నాడు. ఈ ఆయిల్‌ను కొన్ని పరిశ్రమలు ఐవోసీ, బీపీసీఎల్ వంటి ఆయిల్ సంస్థల నుంచి కొనుగోలు చేస్తుంటాయి. సంస్థల నుంచి ట్యాంకర్లలో వాటిని పరిశ్రమలకు తరలించే క్రమంలో వాటి డ్రైవర్ల నుంచి శ్రీనివాస్ తక్కువ ధరకు కొనుగోలు చేస్తుంటాడు. లీటర్ రూ.45కు కొనుగోలు చేసి దాన్ని రూ.55కు విక్రయిస్తున్నాడు. కొంత కాలంగా శ్రీనివాస్ చేస్తున్న అక్రమ వ్యాపారానికి విజిలెన్స్ అధికారులు తాజాగా చెక్‌పెట్టారు. అక్రమంగా డీజిల్ తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో ఏఎస్పీ స్వరూపారాణి ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ఆటోనగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. అదే మార్గంలో ఏపీ02 ఎక్స్2589 నంబర్ గల ట్యాంకర్‌ను ఆపగా.. డ్రైవర్ వాహనం దిగి పరారయ్యాడు. వాహనం నంబర్ ప్రకారం యజమాని నంబర్‌ను తెలుసుకొని ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో సోమవారం ట్యాంకర్‌ను ఆటోనగర్‌లోనే పోలీసులకు అప్పగించి మంగళవారం మళ్లీ యజమానికి ఫోన్ చేసి రప్పించారు. ఓనర్ కమ్ డ్రైవర్‌గా ఉన్న శ్రీనివాస్ అక్రమంగా వ్యాపారం చేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. గాజువాక సహాయ పౌర సరఫరా అధికారికి కూడా సమాచారం అందించారు. ట్యాంకర్‌లో లైట్ డీజిల్ 14,940 లీటర్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయిల్‌తో పాటు ట్యాంకర్‌ను కూడా సీజ్ చేశారు.



సీజ్ చేసిన ట్యాంకర్

ఉప్పొంగిన ఉత్సాహం




సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో ఏయూ విద్యార్థుల కేరింతలు



థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ఫ్లెక్సీలతో స్వాగతం పలుకుతున్న విదేశీ విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన విద్యార్థుల్లో ఆనందం ఉరకలెత్తింది. పేదింటికి సైతం చదువులను చేరువ చేసిన సీఎం జగన్‌ను చూసి ‘థాంక్యూ సీఎం సార్’ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విద్యార్థుల ఉత్సాహాన్ని చూసిన సీఎం తన వాహనం ఫుట్ రెస్ట్ పైనుంచి చిరునవ్వుతో వారికి అభివాదం చేశారు.


ఎంతో సంతోషంగా ఉంది



సీఎం జగన్‌ను నేరుగా చూసే అవకాశం లభించడం ఎంతో సంతోషంగా ఉంది. పరిశోధనలకు ఉపయోపగపడేలా ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకురావడంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. మా భవిష్యత్తు కోసం సీఎం జగన్ నిరంతరం తాపత్రయపడుతున్నారు.

– గుడిపూడి తేజస్వి, ఎం.ఫార్మసీ


భవిష్యత్తుకు భరోసా



ఏయూలో చదివే అవకాశం వచ్చిందంటే భవిష్యత్తుకు భరోసా దొరికినట్లే. ఇక్కడి ప్రొఫెసర్లు మమ్మల్ని వారి సొంత బిడ్డల్లా చూసుకుంటున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో చదువులు సాగుతున్నాయి. సీఎం జగన్ పాలనలో మాలాంటి వారి చదువుకు మరింత భరోసా దక్కింది.

– ఎస్.గాయత్రి, ఎంటెక్, బయోటెక్నాలజీ

గర్వంగా ఉంది



ఎంతో పేరున్న ఏయూలో చదువుకుంటున్న అనుభూతి మాటల్లో చెప్పలేం. యూనివర్సిటీలో స్నేహపూర్వక వాతావరణం ఉంది. విద్యార్థులకు భద్రతకు ఢోకాలేదు. నాణ్యమైన బోధనతో పాటు, సీఎం ప్రారంభించిన ప్రాజెక్టులు పరిశోధనలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

– గౌవోని బాషా, ఎంబీఏ

ఉన్నత చదువులకు ధీమా



పరిశోధనలకు ఉపయోగపడే ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉంది. నాణ్యమైన చదువులు అందించేలా యూనివర్సిటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సీఎం జగన్ పాలనలో ఉన్నత విద్యపై పేద విద్యార్థులకు ధీమా పెరిగింది.

– గోన యశస్విని, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ

పరిశోధనలకు ప్రాధాన్యం



98 ఏళ్ల ఏయూ చరిత్రలో 2019కు ముందు ఆ తర్వాత అన్న రీతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ సహకారంతో వీసీ ప్రత్యేక చొరవతోనే ఇది సాధ్యమయింది. దేశ, విదేశాల విద్యార్థులు ఇక్కడికి వస్తున్నారు. కొత్త ప్రాజెక్టుల భవన సముదాయాలతో పరిశోధనా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

– డాక్టర్ కటికతల రాజమాణిక్యం, అసోసియేట్ ప్రొఫెసర్

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం





ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: నగరంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక విమానంలో ఉదయం 11.13 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. నగర పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 2.22 గంటలకు విశాఖ విమానాశ్రయానికి తిరిగి చేరుకున్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేక విమానంలో 2.28 గంటలకు గన్నవరం బయలుదేరారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, వేణుగోపాల కృష్ణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం, వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. సీఎంతో పాటు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విశాఖ వచ్చారు.



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

మది నిండుగా అభిమానం

తాటిచెట్లపాలెం: విశాఖ విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవీఎంసీ 45వ వార్డు ప్రజలు సాలగ్రామపురం వద్ద ఘనస్వాగతం పలికారు. నగరాన్ని, ఉత్తరాంధ్రను ఎంతో అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌కు తామంతా రుణపడి ఉంటామని తెలిపారు. వీరిలో కొందరు ముఖ్యమంత్రిపై ఉన్న అభిమానాన్ని ప్రత్యేకంగా చాటుకున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు తరలివచ్చిన మహిళలు

నీ భవిష్యత్ జగన్ మావయ్యేనమ్మా



సాక్షి, విశాఖపట్నం: డెలివరీ బాయ్‌గా పనిచేసే భర్త గౌతమ్‌తో గోపాలపట్నంలో ఉంటోంది కిరాట అలేఖ్య. సీఎం జగన్ మంగళవారం విశాఖ నగరానికి వస్తున్నారని తెలుసుకుంది. తన పది నెలల పసిబిడ్డ భవిజ్ఞ అనుశ్రీకి జగన్‌ను చూపించాలన్న ఉద్దేశంతో ఉదయాన్నే ఇంటి పనులు, వంట పనులు చకచకా పూర్తి చేసుకుంది. బిడ్డకూ స్నానం చేయించి దుస్తులు వేసింది. అనుశ్రీని చంకన బెట్టుకుని ఉదయం 11 గంటలకు ఎన్ఏడీ జంక్షన్‌కు చేరుకుంది. కాసేపటికే సీఎం జగన్ ఎన్ఏడీ జంక్షన్‌కు వచ్చి కొద్ది నిమిషాలు ఆగి అందరికీ కారులో నుంచే అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. ఆ కొద్ది క్షణాల్లోనే అదిగదిగో మీ మావయ్య.. అంటూ సీఎం జగన్‌ను చూపిస్తూ, కూతురితో బైబై చెప్పించి మురిసిపోయింది అలేఖ్య.

సీఎం జగన్ కోసం ప్రాణాలిస్తా



మాది సాలగ్రామపురం దరి సింహగిరికాలనీ. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఆయన కోసం ప్రాణాలిస్తాం. ఆయనపై ఉన్న అభిమానాన్ని పచ్చబొట్టు రూపంలో చేతిపై వేయించుకున్నా. పవన్, చంద్రబాబు లాంటి వాళ్లు ఎంత మంది ఏకమైనా సీఎం జగనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. ఏ కుటుంబంలో చూసినా ఈ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన వారు కచ్చితంగా ఉంటారు. – ఎస్.వరలక్ష్మి

శ్వాస ఉన్నంత వరకు జగనన్నతోనే..



మాది నూజివీడు. సీఎం జగన్ అంటే నాకు అభిమానం. అందుకే ఆయన ఫొటోను ఛాతీపై పచ్చబొట్టు రూపంలో వేయించుకున్నాను. రాష్ట్రంలో ఎక్కడ వైఎస్సార్ సీపీ సభలు జరిగినా నేను వెళ్తాను. విశాఖలో సీఎం పర్యటన ఉండటంతో.. ఇక్కడికి వచ్చాను. జగనన్న మా కుటుంబానికి ఎంతో చేశారు. నా శ్వాస ఉన్నంత వరకు ఆయన్నే అభిమానిస్తా.. ఆయన్ని ప్రధానమంత్రిగా చూడాలని ఉంది. నా కోరిక తీరే రోజు తప్పక వస్తుంది. – పి.బాలు, నూజివీడు

'మత్స్య' సిరి



మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప

ముంచంగిపుట్టు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డలోకి వరద నీరు చేరడంతో గిరిజన మత్స్యకారుల పంట పండుతోంది. భారీ సైజు లో చేపలు వలలకు చిక్కుతుండటంతో మంచి ఆదాయం పొందుతున్నారు. మంగళవారం మండలంలోని పెదగూడ పంచాయతీ గలగండ వద్ద మత్స్యగెడ్డలో 15 కిలోల బంగారు పాప మత్స్యకారుడు వి.బిస్‌నాథ్ వలకు చిక్కింది. మార్కెట్లో కిలో రూ.300 చొప్పున 15 కిలోల చేపను రూ.4,500కు విక్రయించాడు. ఈ రకం చేప కేవలం వర్షాకాలంలో మాత్రమే లభ్యం కావడంతో కొనుగోలు చేసేందుకు పోటీపడుతున్నారు.

ప్రశాంతంగా ఫార్మేటివ్ పరీక్షలు



విశాఖ విద్య: ఫార్మేటివ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, గణితం పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నపత్రంతో పరీక్షలు జరిగాయి. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పేరిట విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నందున ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేశారు. పరీక్షా సమయంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ నేరుగా విద్యార్థులతో ఫోన్ ద్వారా మాట్లాడే అవకాశం ఉందని ముందస్తు సమాచారంతో ప్రభుత్వ పాఠశాలల్లో తగిన ఏర్పాట్లు చేశారు. తొలిరోజు పరీక్షలు అన్ని పాఠశాలల్లో ప్రశాంతంగా జరిగాయని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి కృష్ణ కుమార్ తెలిపారు.

'సీఎం జగన్ పాలనపై నమ్మకం ఉంది'



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై తమకు ఎంతో నమ్మకం ఉందని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి అన్నారు. నగరంలోని ఎన్జీవో హోంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వలంటీర్ ప్రభుత్వ ఉద్యోగి కాదని, ప్రభుత్వం నియమించిన సోషల్ వర్కర్ అని అన్నారు. వలంటీర్లతో ఎన్జీవో సంఘానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్జీవోల సమస్యలు చాలా వరకు పరిష్కారమయ్యాయని.. చిన్న చిన్న సమస్యలనూ పరిష్కరించేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఉద్యోగులకు చెందిన ఎరియర్స్, జీపీఎఫ్, సరెండర్ లీవు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏపీ వైద్య విధాన పరిషత్‌లో 30 ఏళ్లుగా సక్రమంగా జీతాలు రాని ఉద్యోగులకు ఇప్పుడు నెలసరి జీతాలు వస్తున్నాయన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. అన్ని సమస్యలు పరిష్కారం అవుతుంటే ఆందోళన ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, నాయకులు నారాయణరావు, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో టర్న్ అరౌండ్ ప్రతిజ్ఞ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం టర్న్ అరౌండ్ ప్రతిజ్ఞ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌ను మూడు నెలల్లో లాభాల్లోకి తీసుకురావడమే ధ్యేయంగా సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లతో పాటు స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆర్థిక ఒత్తిడిపై సీఎండీ అతుల్ భట్ వివరించారు. రానున్న మూడు నెలల్లో కంపెనీ పనితీరును మార్చేందుకు, లాభాల్లో తీసుకు వెళ్లేందుకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ఉక్కు ఉత్పత్తుల అవుట్‌పుట్‌ను 20 శాతం పెంచడంపై దృష్టి సారించాలన్నారు. బొగ్గు మిశ్రమాన్ని ఆప్టిమైజ్ చేయడం, పీసీఐ పెంచడం, ఆక్సిజన్ ఎన్‌రిచ్‌మెంట్‌ను పెంచడం, స్క్రాప్ వినియోగం పెంచడం తదితర వ్యయ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని 10 శాతం తగ్గించడంపై కూడా దృష్టి పెడతామని ప్రతిజ్ఞ చేశారు. డైరెక్టర్లు డీకే మొహంతి, ఏకే బాగ్చీ, ఎస్‌సీ పాండేతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్, లైజన్, గనుల శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంచీ వర్సిటీ రిజిస్ట్రార్‌గా కోసలరావు



నియామక పత్రం అందుకుంటున్న కోసలరావు

కొమ్మాది: జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విశాఖ జిల్లా రుషికొండ ప్రాంతానికి చెందిన కొలిపాక కోసలరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విద్యాభ్యాసం ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో సాగింది. ఆయన సతీమణి మంజుల విశాఖలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థలో టీచర్‌గా పని చేస్తున్నారు. కోసలరావును రాంచీ వర్సిటీ వైస్ చాన్సలర్ బి.కె.దాసు అభినందించారు.

సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు

నర్సీపట్నం: పాడి పశువులకు సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని విశాఖపట్నం ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఉప సంచాలకురాలు(డి.డి) డాక్టర్ పి.మోహినీ కుమారి సిబ్బందికి సూచించారు. పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో డాక్టరు వైఎస్సార్ నియోజకవర్గ స్థాయి వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన రికార్డును పరిశీలించారు. ల్యాబ్‌లో పరీక్షల వివరాలను ల్యాబ్ టెక్నీషియన్ ఆర్.ఉదయను అడిగి తెలుసుకున్నారు.

ప్రేమ వ్యవహారం.. మైనర్ ఆత్మహత్య

తల్లిదండ్రులు మందలించారని ఉరి వేసుకున్న వైనం



పెంట అఖిల్ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: ప్రేమ వ్యవహారంలో తల్లిదండ్రులు మందలించారని మంగళవారం ఓ మైనర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాజువాక ఎస్సై కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక కైలాష్‌నగర్‌కు చెందిన కార్పెంటర్ పెంట కిరణ్, విజయ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో చిన్న కుమారుడు పెంట అఖిల్ (16) గాజువాకలో ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఇదే క్లాస్‌కు చెందిన ఒక బాలికతో ప్రేమలో పడ్డాడు. ఈ విషయం తెలిసిన అఖిల్ తల్లిదండ్రులు కుమారుడ్ని మందలిస్తూ వస్తున్నారు. ఈ మధ్య కాలంలో క్లాస్‌లో కూడా డల్‌గా ఉంటున్నాడని తోటి విద్యార్థులు చెబుతున్నారు. మంగళవారం కూడా తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన అఖిల్ ఇంట్లో వంట గదిలో ఫ్యానుకు టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమ్ముడు వంటగదిలో ఫ్యానుకు వేలాడుతుండడాన్ని అతని అన్నయ్య, కుటుంబ సభ్యులు నిఖిల్‌ను కిందకు దించారు. అప్పటికే మృతి చెందడంతో విషయాన్ని గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అఖిల్ ప్రేమ వ్యాఖ్యలతో సూసైడ్ లెటర్ రాశాడని సమాచారం. తండ్రి కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

బుల్లియన్	
బంగారం (10 గ్రాములు)	
24 కేరట్లు:	రూ.60,440
22 కేరట్లు:	రూ.55,400
వెండి (కిలో):	రూ.81,000

చికెన్ (కిలో)	
ఫారం ధర :	రూ.100
బ్రాయిలర్ (లైవ్):	రూ.120
స్కిన్ :	రూ.210
స్కిన్ లెస్ :	రూ.220

ఏపీఎల్ రెండో సీజన్ హీరో రికీబుయ్

దులీప్ ట్రోఫీలో కీలక పాత్రతో అత్యధిక బిడ్



రికీబుయ్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌లో విశాఖ కుర్రాడు రికీబుయ్‌ని అత్యధిక బిడ్(రూ.8.10 లక్షల)కు బెజవాడ టైగర్స్ ఫ్రాంచైజీ నిలబెట్టుకుంది. తాజాగా దులీప్ ట్రోఫీలో రికీబుయ్ సత్తాచాటడంతో అతన్ని దక్కించుకునేందుకు ఏపీఎల్‌లోనూ ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. తొలి సీజన్ చివరి నిమిషంలో టైటిల్ చేజార్చుకున్న బెజవాడ టైగర్స్ ఈసారి సత్తా చాటేందుకు రికీబుయ్ సారథ్యంలో సిద్ధమవుతోంది. ఆల్‌రౌండర్లు షోయబ్, మహీప్‌కుమార్‌లను మాత్రమే రూ.3 లక్షల పైచిలుకు బిడ్ వేశారు. 13 మంది ఆటగాళ్లను రూ.లక్షకు తగ్గకుండా బిడ్ వేసి దక్కించుకున్నారు.

కీపర్‌గానూ రాణించి..

దేశవాళీ టెస్ట్ క్రికెట్‌గా పేరుపడ్డ దులీప్ ట్రోఫీని సౌత్‌జోన్ గెలుచుకోవడం ఇది 12వ సారి. ఈ సీజన్‌లో రికీబుయ్ నార్త్ జోన్‌పై ఏడు క్యాచ్‌లు పట్టగా, ఫైనల్లో వెస్ట్‌జోన్ మ్యాచ్‌లో ఐదుగురిని వికెట్ల వెనుక క్యాచ్‌లతో ఔట్ చేసి, టైటిల్ సాధనలో భాగస్వామ్యం కావడం ఏపీఎల్ వేలంలో కలిసివచ్చింది. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రికీబుయ్ అత్యధిక పరుగులు 187. లిస్ట్–ఏలో 112, టీ20ల్లో 108 పరుగుల అత్యధిక స్కోర్లతో నిలిచాడు. తన లెగ్‌బ్రేక్ గూగ్లీతో ఫస్ట్‌క్లాస్‌లో ఐదుగుర్ని, లిస్ట్ ఏ క్రికెట్‌లో ముగ్గుర్ని ఔట్ చేసి బౌలింగ్‌లోనూ సత్తాచాటాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్‌జోన్‌కు భరత్ అందుబాటులో లేకపోవడంతో రికీబుయ్ కీపింగ్ బాధ్యతలు తీసుకుని, కీలక క్యాచ్‌లతో మ్యాచ్ విజయానికి దోహదపడ్డాడు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు శిక్ష

విశాఖ లీగల్ : బ్యాంకు ఖాతాలో తగినన్ని నిధులు లేకుండా చెక్కు జారీ చేసిన నేరానికి ఆరు నెలల జైలు, రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాల్సిందిగా నగరంలోని రెండవ ప్రత్యేక మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పునిచ్చారు. రూ.10 లక్షలను 2021 ఆగస్టు నెల నుంచి 9 శాతం వడ్డీతో ఫిర్యాదిదారుకు చెల్లించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు. ఫిర్యాదీ న్యాయవాది అందించిన వివరాలు. ఎంవీపీ కాలనీ ప్రాంతానికి చెందిన కోటేశ్వరరావు విద్యుత్ శాఖలో ఉద్యోగి. వేపగుంటకు చెందిన నిందితుడు శ్రీనివాసరావు తన వ్యాపార అవసరాల నిమిత్తం కోటేశ్వరరావు నుంచి పలు దఫాలుగా రూ.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చే నిమిత్తం 2018 డిసెంబర్ 17న ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. తన అప్పు చెల్లించాల్సిందిగా కోరగా శ్రీనివాసరావు 2021 ఆగస్టు 10న పాక్షికంగా రుణాన్ని తీర్చే నిమిత్తం రూ.10 లక్షలకు ఒక చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును కోటేశ్వరరావు తన బ్యాంకు ఖాతాలో జమ చేయగా నిందితుని బ్యాంకులో తగినన్ని నిధులు లేని కారణంగా చెక్కు బౌన్స్ అయింది. దీంతో బాకీ చెల్లించాలని ఫిర్యాదీ న్యాయవాది లీగల్ నోటీసు పంపించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఫిర్యాదిదారుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



తీరానికి కొట్టుకుని వచ్చిన మృతదేహం

కొమ్మాది: రుషికొండ బీచ్‌కు మంగళవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం కొట్టుకొచ్చింది. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న లైఫ్‌గార్డ్స్ ఈ మృతదేహాన్ని చూసి ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 28 ఏళ్ల వయసు ఉన్న యువకుడు.. చామనఛాయ రంగులో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఏయూలో అభివృద్ధిని సీఎంకు వివరిస్తా..

మంత్రి బొత్స సత్యనారాయణ



మంత్రి బొత్స సత్యనారాయణను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విచ్చేశారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఏయూ పరిపాలన భవనంలో ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ప్రాజెక్టుల ప్రగతిని మంత్రికి వివరించారు. ఇక్కడ జరుగుతున్న ప్రగతిని ముఖ్యమంత్రికి వివరిస్తానని మంత్రి తెలిపారు. ఏయూలో ముఖ్యమంత్రి ప్రత్యేక పర్యటన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వర్సిటీ తరఫున మంత్రిని వీసీ సత్కరించారు.

నగరంలో నేడు

- ఉదయం 10 గంటలకు నోవాటెల్‌లో ఓటర్ల నమోదుపై రాష్ట్రస్థాయి కలెక్టర్ల సమావేశం
- ఉదయం 10.45 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుంచి మెయిన్ గెట్ వరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన
- మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా కోలా గురువులు ప్రమాణస్వీకారం
- సాయంత్రం 6 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మణిపూర్ ఘటనపై కొవ్వొత్తుల ప్రదర్శన